ఆగని అఘాయిత్యాలు

కఠిన చట్టాలు చేసినా ఆగని ఆకృత్యాలు

మహిళలు, చిన్నపిల్లలపై పెరుగుతున్న వేధింపులు

ఫేస్‌బుక్, వాట్సాప్‌ల వాడకంలో అప్రమత్తత అవసరం



హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త: మహిళలపై విద్యార్థినీలపై రోజురోజుకూ వేధింపులు పెరిగిపోతున్నాయి. ఈమెయిల్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లతో మహిళలను బెదిరిస్తున్న కేసులు కామన్ అయ్యింది. ఇప్పటివరకు వేధింపులకు గురవుతున్న బాధితుల్లో ఎక్కువ శాతం సాఫ్ట్‌వేర్ ఎంప్లాయిస్, కాలేజీ విద్యార్థులే ఉన్నారు. అయితే మగవారితో ఉన్న చిన్న చిన్న పరిచయాలతోనే వేధింపులకు గురవుతున్నారని పోలీసుల దర్యాప్తులో తేలుతుంది. దేశంలో ప్రతిమూడు నిమిషాలకు ఒక నేరం జరుగుతూనే ఉంది. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలు పెచ్చు మీరుతున్నాయి. మారిన సామాజిక పరిస్థితులు, స్థితిగతుల మూలంగా ఎక్కువగా అత్యాచారానికి గురయ్యే విధంగా పురిగొల్పుతున్నాయి. తండ్రి స్థాయిలో ప్రేమానురాగాలు పంచాల్సినవారే పైశాచికంగా లైంగిక దాడులకు పాల్పడమనేది ఊహించుకోలేని పరిస్థితి. ఇలాంటి వేధింపులు భరించలేక కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. తాజాగా బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో కళాశాల ప్రిన్సిపల్ డ్రైవర్ ఎల్‌కెజి విద్యార్థిని పై హత్యాచార యత్నం చేయడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రిన్సిపల్‌ను, డ్రైవర్‌ను అరెస్ట్ చేసిన విచారణ జరుపుతున్నారు.

సామాజిక మాధ్యమాలతో జాగ్రత్త.. ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సామాజిక మాధ్యమాల ప్రభావ విస్తృతి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పెద్దలే కాదు పాఠశాల స్థాయి పిల్లలూ వీటిని వినియోగిస్తున్నారు. సమాచార మార్పిడిలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన మాట వాస్తవమే అయినా.. పరువు తీసే విషయంలో ఈమాధ్యమాలు ముందుంటున్నాయి. ముఖ్యంగా అమ్మాయిలు వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. భర్తతోనో, ప్రియుడితోనో సన్నిహితంగా ఉన్నప్పుడు పొరపాటున చిత్రాలు, వీడియోలు తీసుకుంటే భవిష్యత్తులో ఆదృశ్యాలే పరువు తీసే కాలనాగులై కాటేస్తుంటాయి. సంబంధాలు బాగున్నప్పుడు పర్వాలేకున్నా.. ఒక వేళ చెడిపోతే ఆదృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారమై పరువు బజారుకీడుస్తున్నాయి. మరోవైపు సామాజిక మాధ్యమాల్లో అందమైన అమ్మాయిలు కనబడితే చాలు నగ్న చిత్రాలు మార్ఫింగ్ చేసి బెదిరించే కేటుగాళ్లు ఈమధ్యకాలంలో పెరిగిపోయారు. దీనికితోడు వాట్సప్‌లకు అసభ్య సందేశాలు పంపిస్తూ వేధింపులకు గురిచేసే కేటుగాళ్లకూ కొదవలేదు. ఈనేపథ్యంలో సామాజిక మాధ్యమాల వినియోగంలో అమ్మాయిలు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఏర్పడింది.

కఠిన చట్టాలు చేసినా ఆగని ఆకృత్యాలు.. ఎన్నిచట్టాలు వచ్చినా బాలికలపై లైంగిక వేధింపులు మాత్రం రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. కఠిన శిక్షలు, నిర్భయ చట్టాలు, పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేసినా నేరం చేయడానికి నిందితులు వెనుకాడటం లేదు. ఎందుకంటే వాటి అమలు విషయంలోని లొసుగులే వారికి ధైర్యాన్నిస్తున్నాయనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. తప్పు చేసిన వారిలో చాలా తక్కువశాతం మందికే శిక్షపడటంతో నిందితులు బరితెగిస్తున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. సమాజానికి భయపడి కొందరు.. పరువు పోతుందని మరికొందరు బయటికి చెప్పుకోలేక పోతున్నారు. బాలికలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే బాధితులకు న్యాయం జరుగుతుందని పలువురు నిపుణులు తెలుపుతున్నారు.

జోడో యాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి

చార్మినార్, అక్టోబరు 19 ప్రభాతవార్త : మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో దేశం అన్ని రంగాల లోను పురోగతిని సాధించిందని, దేశసమైక్యతను కాపాడటానికి,మత సామరస్యాన్ని పెంపొందించటానికి స్వర్గీయ రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్రను ప్రారంభించారని ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరి అన్నారు.చార్మినార్ వద్ద బుధవారం రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి చైర్మన్ జి.నిరంజన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎఐసిసి సెక్రటరీ రోహిత్ చౌదరి,ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి,మాజీ ఎంపి వి.హనుమంతరావులు కలిసి తెలంగాణ ఉద్యమ తొలి తరం నాయకుడు నాలుగు సార్లు ఎంపి.శాసన సభ్యుడిగా ప్రజలకు విశిష్ట సేవలు అందించిన మాజీ ఎంపి ఆర్.సురేందర్‌రెడ్డికి సద్భావనా అవార్డు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరీ మాట్లాడుతూ వచ్చే నెల ఒకటివ తేదీన పాతబస్తీ చార్మినార్ నుంచి జరగనున్న భారత్ జోడో యాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎంపి వి.హనుమంతరావు మాట్లాడుతూ స్వర్గీయ ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు.కాంగ్రెస్ హయాంలోనే దేశం అన్ని రంగాలలోను అభివృద్ధి సాధించిందని,కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలను పెంచటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురివుతున్నాని తెలియజేశారు.సద్భావనా అవార్డు గ్రహీత మాజీ ఎంపి ఆర్.సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్‌గాంధీ గొప్ప నాయకుడు అని,సద్భావనా అవార్డు లభించటం తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.కాగా అంతకు ముందు స్వర్గీయ రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పలువురు కాంగ్రెస్ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్య క్రమంలో మాజీ మంత్రులు మర్రి శశిధర్‌రెడ్డి,దామోధర్ రెడ్డి,ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి,మాజీ శాసన సభ్యులు ఎం.కోదండ రెడ్డి,పి.

ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరి



చార్మినార్ వద్ద జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ తొలి తరం నాయకుడు మాజీ ఎంపి ఆర్.సురేందర్‌రెడ్డికి సద్భావనా అవార్డు ప్రధానం

విష్ణువర్ధన్ రెడ్డి,మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్యాంమోహన్,రాజీవ్‌గాంధీ సద్భావనాయాత్ర స్మారక సమితి చైర్మన్ జి.నిరంజన్,ప్రధాన కార్యదర్శులు ముజాహిదుద్దీన్,కన్నయ్య లాల్,జి.ఆనంద్,వెంకటేష్ ముదిరాజ్,ఎస్.పి.కాంత్రి కుమార్,కె.ప్రభాకర్ రెడ్డి,శ్యాంరావు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిహెచ్‌ఎంసి కమిషనర్, విజిలెన్స్

కార్యాలయాల పేరిట వసూళ్లు

కూకట్‌పల్లి జోన్ సర్కిళ్లలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ల లీలలు ● బ్రోకర్లు, లైసెన్స్ ప్లానర్లతో రూ.కోట్ల వసూళ్లు

బాలానగర్ జోన్ ప్రతినిధి, అక్టోబరు 19 ప్రభాతవార్త: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం పరిధిలోని 24, 25,26, 27 సర్కిళ్ళ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)కార్యాలయాలు అవినీతి, అక్రమార్జనలో రికార్డులు సృష్టిస్తున్నాయి. భవన నిర్మాణాలపై నిత్య పర్యవేక్షణ చేయాల్సిన కొందరు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు మామూళ్ళ మత్తులో మునిగి తేలుతున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే వాటిని ప్రోత్సహిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను పర్యవేక్షించే పట్టణ ప్రణాళిక విభాగం ఉన్నతాధికారులు ఓ ధర నిర్ణయించి అక్రమ సంపాదనే లక్ష్యంగా సాగిపోతున్నారు. టౌన్‌ప్లానింగ్ అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులపై సంతకాలు పెడుతున్న కొందరు అధికారులు వాటిని లెక్కపెట్టుకుంటున్నారు. లెక్కలు రాసుకుని మరీ తర్వాత ఆ లెక్కలకు సరిపడా మామూళ్ళు ఇస్తున్నారా, లేదా అని ఆరా తీస్తున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం, కూకట్‌పల్లి, అల్వాల్ సర్కిళ్ళలోని అనేక ప్రాంతాల్లో అడ్డు అదుపు లేకుండా వెలుస్తున్న అక్రమ భవనాలపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా మొక్కుబడిగా నోటీసులు జారీచేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పైగా న్యాయస్థానాలను ఆశ్రయించి ఏ విధమైన చర్యలు చేపట్టకుండా స్టేతెచ్చుకుంటే బావుంటుందనే ఉచిత సలహాలను సైతం నోటీసులు ఇచ్చిన భవన యజమానులకు కొంతమంది అధికారులు ఇస్తున్నారన్న ప్రచారం కూడా బాహాటంగానే వినిపిస్తోంది. అనుమతులు లేకపోయిన సెల్లార్లలో నిర్మాణాలు చేపట్టడం, అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించడం ఏ మాత్రం సెట్‌బ్యాక్ వదలకుండా అక్రమ నిర్మాణాలు నిర్మించడం లాంటి అక్రమాలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయంటే కూకట్‌పల్లిజోన్‌లోని సర్కిళ్ళ అసిస్టెంట్ సిటీ ప్లానర్ల(ఏసీపీలు) అండదండలు అక్రమ నిర్మాణాలకు ఏ రేంజ్‌లో ఉన్నాయో స్పష్టం అవుతోంది. అక్రమ నిర్మాణాలు అదికారులకు రూ. కోట్లు కురిపిస్తున్నాయని చెప్పవచ్చు. పలు ప్రాంతాల్లో రెసిడెన్సియల్ పేరిట అనుమతులు తీసుకుంటున్న అనేక మంది బిల్డర్లు, నిర్మాణదారులు వాణిజ్య అవసరాల నిమిత్తం మడిగెలు, దుకాణాల్ని నిర్మిస్తున్నారు. పార్కింగ్‌కి కేటాయించిన సెల్లార్లలో అక్రమంగా నిర్మాణాల్ని కొనసాగిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపులేకుండా పోయింది. అనుమతుల కోసం ముందుగా ప్లాన్‌లో అన్నీ సక్రమంగానే ఉన్నట్లు పేర్కొని భవన నిర్మాణ అనుమతులు పొంది ఆ తర్వాత అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.

ఘనాపాటీల మామూళ్ళ రేట్లు ఇలా..

బహుళంతస్తులకు రూ.5 లక్షలు, కమర్షియల్ భవనాలకు రూ.20లక్షలు

కమర్షియల్ భవనాలకు ఓ ధర, అనుమతి లేకుండా అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణమైతే మరో రేటు నిర్ణయించి కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు వసూళ్ళకు పాల్పడుతున్నారు. అక్రమ బహుళంతస్తుల భవనం వద్ద రూ. ఐదు లక్షలకు తగ్గకుండా మామూళ్ళు, ఇక పెద్ద పెద్ద భవనాలు , అక్రమ కమర్షియల్ నిర్మాణాలు అయితే రూ. పది లక్షల నుంచి రూ. 20 లక్షలకు పైగా అక్రమ వసూళ్ళను వసూలు చేస్తున్నారన్న ప్రచారం కూడా సాగుతోంది ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ వసూళ్ళకు పాల్పడుతూ అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు

జోనల్ కార్యాలయం

తీసుకోవడంలేదు. అనేక ప్రాంతాల్లో స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉండడంతోపాటు స్థానికంగా వాణిజ్య అవసరాలు పెరుగడంతో జీ ప్లస్ టూ వరకు రెసిడెన్సియల్ అనుమతులు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా పెద్ద పెద్ద కమర్షియల్ భవనాల్ని నిర్మిస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు.

జిహెచ్‌ఎంసి కమిషనర్, విజిలెన్స్ కార్యాలయాల పేరిట వసూళ్లు

కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం పరిధిలోని 25,26,27 సర్కిళ్ళలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)కార్యాలయాల్లో కీలక బాధ్యల్ని కొందరు అధికారుల అవినీతి లీలలు అంతా ఇంతాకావు. అక్రమ వసూళ్ళలో ఘనా పాటీలైన కొందరు అధికారులను ఎవరైనా నిర్మాణ అనుమతుల్లో జాప్యం తోపాటు ఇంత పెద్ద మొత్తంలో మామూళ్ళు ఇచ్చుకోలేమని ఎవరైనా అంటే జిహెచ్‌ఎంసి కమిషనర్, విజిలెన్స్ కార్యాలయాల్లో కూడా తాము మామూళ్ళను ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి అక్రమ కమర్షియల్ నిర్మాణాలు చేపట్టే బిల్డర్లతోపాటు నిర్మాణదారుల వద్ద పెద్ద మొత్తంలో వసూళ్ళు చేస్తూ రెండు చేతుల సంపాదిస్తూ తమ అవినీతి దందాను కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా జిహెచ్‌ఎంసి కమిషనర్, విజిలెన్స్ కార్యాలయాల పేరిట అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్న అక్రమార్కులపై ఎందుకు చర్యలు తీసుకోవడంలే దని పలువురు ప్రశ్నిస్తున్నారు. అక్రమ కట్టడాలపై జిహెచ్‌ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్‌లు దృష్టిసారించకపోవడంతో కూకట్‌పల్లి జోన్ పరిధి లోని పలు ప్రాంతాల్లో అడ్డూ అదుపులేకుండా అక్రమ నిర్మాణాలు పెరిగిపో తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. అనేక ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా వెలసిన నిర్మాణాలలో మధ్యవర్తుల పాత్ర కీలకమనడంలో సందేహం లేదు. నేరుగా డబ్బులు తీసుకుని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి అడ్డంగా బుక్కవడం కంటే మధ్యవర్తుల ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా మామూళ్ళు తీసుకోవడానికి అలవాటుపడిన కొందరు అధికారులు ముందే కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని భవన నిర్మాణం పూర్తయ్యే వరకు అటువైపు కన్నెత్తి చూడకుండా సహకరిస్తున్నారు.

జంట హత్య కేసులో మరో ముగ్గురి అరెస్ట్

ఉప్పల్, అక్టోబరు 19 ప్రభాతవార్త : ఉప్పల్ జంట హత్య కేసులో మరో ముగ్గురు వ్యక్తులను బుధవారం ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ గాంధీ విగ్రహం వద్ద ఉన్న హనుమ సాయికాలనీలో నివాసం ఉండే నరసింహుల నరసింహాశర్మ 78 పౌరోహిత్యం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అతని కుమారుడు శ్రీనివాస్35 సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ మలేసియా నుంచి గత రెండు నెలల క్రితం నగరానికి వచ్చి తండ్రి వద్దే ఉంటున్నాడు. ఈనెల 14వ తేదిన ఇద్దరు దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం, మామిడిపల్లికి చెందిన లిక్కి వినయ్ యోగేందర్ రెడ్డి అలియాస్ వినయ్‌రెడ్డి అలియాస్ చింటూ 31తో పాటు, చంపాపేటకు చెందిన అతని స్నేహితుడు యల్లా బాలకృష్ణ అలియాస్ బాలు 33 ప్రధాన నిందితులుగా గుర్తించారు. వీరితోపాటు అదే గ్రామానికి చెందిన లాల్ జగదీష్‌గౌడ్(36) బంజారావాడికి చెందిన గన్వయ రామ్(56) గైక్వాడ్ శ్యామ్ సుందర్ అలియాస్ శ్యామ్(42) లను మంగళవారం రిమాండ్ చేయగా, మిగిలిన మరో ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేశారు. బుధవారం నిందితులకు సహకరించిన గడ్డి కార్తీక్ 22, వాకిటి సుధాకర్‌రెడ్డి32లతోపాటు, లిక్కి వినయ్ తల్లి లిక్కి సావిత్రి 60ని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కార్తీక్, సుధాకర్‌రెడ్డిలు ద్విచక్ర వాహనాన్ని అందించారని, నేరం జరిగిన తర్వాత తప్పించుకునేందుకు నిందితులకు డబ్బులు పంపించినట్లు తెలిపారు. నిందితుడు వినయ్ రక్తం ఉన్న బట్టలు అతని తల్లి లిక్కి సావిత్రి ఉద్దేశ్యపూర్వకంగానే ఉతికినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ముగ్గురిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి ఒక బైక్, రెండు సెల్‌ఫోన్లు, బట్టలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సికింద్రాబాద్‌లో రూ. వంద కోట్లతో అభివృద్ధి పనులు

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, అక్టోబర్ 19 ప్రభాతవార్త : అభివృద్ధి కార్యక్రమాల అమలు, సంక్షేమ కార్యాకలాపాల నిర్వహణలో సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అగ్ర స్థానంలో నిలిపేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని, కొత్తగా రూ. 102 కోట్ల మేరకు నిధులను వివిధ అభివృద్ధి పనులకు సాధించామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తెలిపారు. బుధవారం సీతాఫల్ మండిలోని తన క్యాంపు కార్యాలయంలో పద్మారావుగౌడ్ వివిధ అంశాలపై ప్రసంగించారు. విలేకరుల, మీడియా ప్రతినిధులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ పరిధిలో ఒక్క జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ కూడా లేని లోటును తీర్చి సీతాఫల్‌మండి ప్రభుత్వ స్కూల్ ప్రాంగణంలోనే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలను ప్రారంభించి స్థానికుల దశాబ్దాల కలను నెరవేర్చ గలిగామని తెలిపారు. తరగతి గదులు లేని లోటును తీర్చేందుకు ప్రస్తుతమున్న పాత భవనాలను కూల్చివేసి నూతన భవనాలను నిర్మించనున్నామని తెలిపారు. ఇందుకు సంబందించి ఆయా విభాగాల అధికారులను సమన్వయపరిచి రూపొందించిన అంచనాల మేరకు రూ. 29.75 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 226 ద్వారా విడుదల చేసిందని ప్రకటించారు. కొత్త భవనాల నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలన్న తన అభ్యర్థతకు స్పందించి ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులను మంజూరు చేసినందుకు తన పక్షాన, సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధుల్లో హైస్కూల్ భవన నిర్మాణానికి రూ. 14.45కోట్లు, జూనియర్ కాలేజీ భవనానికి రూ. 6.30 కోట్లు, డిగ్రీ కాలేజీ భవన నిర్మాణానికి రూ. 9కోట్ల రూపాయలు వినియోగిస్తారని తెలిపారు. త్వరలోనే నూతన భవనాల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుపుతామని చెప్పారు. మెట్టుగూడ నుంచి ఆలుగడ్డ బావి మీదుగా చిలకలగూడ ప్రధాన రహదారిలో రైల్వేబ్రిడ్జీ (ఆర్‌యూబీ) ట్రాఫిక్ రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని, ఈ బ్రిడ్జీని విస్తరించాలన్న తమ సూచనకు రాష్ట్ర ప్రభుత్వం

డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ స్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీ ప్రతినిధులు

ఆమోదం తెలిపి రూ. 30 కోట్లు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. సీతాఫల్‌మండి, తార్నా కల మధ్య మాణికేశ్వరీనగర్ ప్రాంతం మీదుగా రాకపోకలకు అడ్డుగా ఉన్న రైల్వేట్రాక్ ఇబ్బందికరంగా మారిందని, అనేక పర్యాయాలు ప్రమాదాలు జరిగి ఎంతో ప్రాణాలు కోల్పోయారని అన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రూ. 20 కోట్ల ఖర్చుతో మాణికేశ్వరీనగర్ నుంచి ఇందిరానగర్ కాలనీల మధ్య ఆర్‌యూబీ నిర్మాణం జరుపన్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులు కూడా మంజూరయ్యాయని తెలిపారు. లాలాపేట్‌లో రూ. 6కోట్ల ఖర్చుతో నూతనంగా స్విమ్మింగ్‌పూల్ నిర్మాణ పనులు ప్రారంభించామని, త్వరలోనే నిర్మాణం పూర్తి చేసుకొని ప్రజలకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. లాలాపేట్‌లోనే రూ. 9.99 కోట్లతో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి కూడా ఆమోదం లభించిందన్నారు. ఈ సమావేశం లో కార్పొరేటర్‌లు రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మీ, కంది శైలజ, నేతలు తీగుళ్ల కిరణ్‌కుమార్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్, త్రినేత్ర గౌడ్, కంది నారాయణ, కరాటేరాజు, లింగాని శ్రీనివాస్, టీఆర్ టీ శేఖర్, గరికపాటి చంద్రశేఖర్, సుంకు రాంచందర్, అశ్విన్ కుమార్, రాజేశ్, బొగ్గుల కృష్ణ, బెజ్జంకి రాజేశ్, పాకసాయి, శైలేందర్‌లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

నార్సింగి, అక్టోబర్ 19 ప్రభాతవార్త : పరిసరాల పరిశుభ్రతపై బుధవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ అధికారులు వివిధ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కమిషనర్ వేణు గోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు డిఇ యాదయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్‌లు న్యూ లిటిల్ స్కాలర్ స్కూల్, ఎల్ఎన్ఆర్ హైస్కూల్‌లలో క్లీన్ ఇండియా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిశుభ్రతే అంటు రోగాలను వ్యాపింపచేస్తుందని తెలిపారు. ఇళ్లు, ఇంటి పరిసరాలలో నీరు, చెత్త నిలువ ఉండకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఎక్కువ కాలం నిలువ ఉన్న నీరు, చెత్తలపై అంటు వ్యాధులను కలిగించే వైరస్‌లు, బ్యాక్టీరియాలు వృద్ధిచెందుతాయన్నారు. తడి,పొడి చెత్తలను వేరు చేసి ఇళ్ల ముందుకు వచ్చే రిక్షాలలోనే వేయాలని తెలిపారు. ఇంటిని శుభ్రం చేసి ఆ చెత్తను రోడ్లపై వేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై భారీ ఎత్తున అపరాద రుసుమును వసూలు చేస్తామని హెచ్చరించారు. అలాగే వాతావరణంను వేగంగా కలుషితం చేస్తున్న ప్లాస్టిక్ వస్తువుల వాడకంను పూర్తిగా మానుకోవాలని సూచించారు. పాలిథిన్ కవర్ల వాడకం విపరీతంగా పెరిగిందని, అవి భూమిలోగాని, నీటిలో గాని కరుగడానికి వందల ఏళ్ల సమయం పడుతుందన్నారు. దీంతో జల చర జీవులు వీటిని తిని అరుగక మరణిస్తున్నాయని తెలిపారు. వాతావరణంను నాశనం చేసే పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల వాడకంను పూర్తిగా తగ్గించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, వారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో క్లీన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా చెత్తను ఎత్తివేస్తున్న విద్యార్థులు

తెలుగుజాతి గర్వించదగ్గ మహోన్నత నటుడు అక్కినేని : కె.వి.రమణాచారి

రవీంద్రభారతి, అక్టోబరు 19 ప్రభాతవార్త : అక్కినేని నాగేశ్వరరావు జీవితంలో 75ఏళ్ల పాటు నటించి ప్రపంచంలోనే సుదీర్ఘకాలం నటించిన 2వ నటుడు కావడం, భారతజాతి, తెలుగుజాతి గర్వించదగ్గ మహోన్నత నటుడని, నటించినంతకాలం జీవిస్తాను, జీవించినంతకాలం నటిస్తానని చెప్పి చూపించిన మహోన్నత వ్యక్తిత్వమున్న ఉత్తముడు ఎఎన్ఆర్ అని కొనియాడిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అక్కినేని పేరున ఒక యువకుడికి అక్కినేని కళారత్న స్వర్ణకంకణం బహూకరించడం, స్వీకర్త లోహిత్‌కుమార్ ఎంతో అదృష్టవంతుడని ఆయన్ను ఎంతగానో అభినందిం చారు. ప్రముఖ సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ వంశీ ఇంటర్నేషనల్ స్వర్ణోత్సవ సంబురాల్లో భాగంగా వంశీ-శుభోదయం సంయుక్త ఆధ్వర్యం లో వంశీ సంస్థల వ్యవస్థాపకుడు కళాబ్రహ్మ శిరో మణి డా. వంశీ రామరాజు నేతృత్వంలో, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ సభాధ్యక్షతన బుధ వారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణా చారి విశిష్ట అతిథులు లయన్. డా. కె.లక్ష్మీప్రసాద్, జయ పీసపాటి, దైవజ్ఞశర్మ, ఆత్మీయ అతిథులు ప్రముఖులు బాబిలహరి, కరుణ భూషణ్, స్వప్న, దీప్తి వాజ్‌పాయ్, నాగబాల సురేష్‌కుమార్, ఆర్‌సి ఎం.రాజు, బి.వి.పట్టాభిరామ్ తదితరులతో కలిసి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, పద్మవిభూషణ్, నటసమ్రాట్ డా. అక్కినేని నాగేశ్వరరావు 99వ జయంతిని పురస్కరించుకొని ప్రముఖ సినీ, టీవి, రంగస్థల నటుడు లోహిత్‌కుమార్‌కు 35 సంవత్సరాల సాంస్కృతిక మహోత్సవ సందర్భంగా ఘనంగా సత్కరించి అక్కినేని కళారత్న స్వర్ణ కంకణ పురస్కారం ప్రదానం చేసి ఎంతగానో అభినందించారు.

పురస్కార స్వీకర్త లోహిత్‌కుమార్ దంపతులతో రమణాచారి, మామిడిహరికృష్ణ, వంశీరామరాజు, దైవజ్ఞశర్మ, లక్ష్మీప్రసాద్

సంగీత్ చౌరస్తాలో క్యారేజి వే జంక్షన్ ఏర్పాటుకు అధికారుల సర్వే

సంగీత్ చౌరస్తాలో క్యారేజ జంక్షన్ ఏర్పాటుకు పర్యవేక్షిస్తున్న డిసిపి ప్రకాశ్ రెడ్డి, జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనరల్ శ్రీనివాస్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు

కంటోన్మెంట్, అక్టోబర్ 19 ప్రభాతవార్త: నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పాదచారులు ఒక చోటి నుంచి మరోచోటికి సాఫీగా వెళ్లేందుకు సికింద్రాబాద్ సంగీత్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యారేజీ వే జంక్షన్‌ను బుధవారం డిసిపి ప్రకాశ్ రెడ

ఖైరతాబాద్‌లో సదర్ ఉత్సవాలు : హాజరుకానున్న ప్రముఖులు

ఖైరతాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త : ఈ నెల 26న యాదవసంఘం ఆధ్వర్యంలో 'సదర్' ఉత్సవాలు నిర్వహించనుంది. ఈ ఉత్సవాలకు మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంఎల్ఎ చింతల రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపి ఎం. అంజన్ కుమార్ యాదవ్, కార్పొరేటర్ పి.విజయారెడ్డి ప్రభృతులు హాజరుకానున్నారు. ఇదిలా ఉండగా, టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి సైతం యాదవ ఉత్సవాలకు హాజరు కానున్నారని కొందరు యాదవ సోదరులు పేర్కొంటున్నారు. ప్రముఖులందరిని నిర్వాహకులు పట్టుశాలువాలతో ఘనంగా సత్కరించనున్నారు. అదేవిధంగా విజేతలుగా నిలిచిన దున్నపోతులకు శాలువాలు, అవార్డులు, పతకాల వంటివి అందించనున్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి
- మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్, అక్టోబర్ 19, ప్రభాతవార్త : పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు, వారి సంక్షేమం కోసం ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఏటా లక్షలాది మంది ప్రయోజనం పొందుతున్నారని మల్కాజిగిరి పార్లమెంట్ టిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కంటోన్మెంట్ 5వ వార్డుకు చెందిన టిఆర్ఎస్ నాయకులు పెద్దాల నర్సింహ్మ యాదవ్ సహకారంతో 5వ వార్డుకు చెందిన పద్మ, అంజూబాయి, మానస, సురేశ్‌లకు మెరుగైన వైద్యం కోసం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యుడు ప్రభాకర్, టిఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

ఎంఎంటిఎస్ నుంచి కిందపడి యువకుడు ఆత్మహత్య

నాంపల్లి, అక్టోబరు 19, ప్రభాతవార్త : నాంపల్లి (హైదరాబాద్) జీఆర్‌పి పరిధిలోని హైటెక్‌సిటీ హఫీజ్‌పేట రైల్వేస్టేషన్ల మధ్య ఎంఎంటిఎస్ కిందపడి ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన దుర్ఘటన బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. జీఆర్‌పి హెచ్‌కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం...గుర్తుతెలియని యువకుడు హైటెక్‌సిటీ హఫీజ్‌పేట రైల్వేస్టేషన్ల మధ్య కిలోమీటరు నంబరు 168/26-28 వద్ద వేగంతో వస్తున్న ఎంఎంటిఎస్ రైలునంబరు 47175కు ఎదురుగా నిలబడగా రైలుఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వయస్సు 30-35. ఎత్తు 5.6అడుగులు. గుండ్రని ముఖం, నల్లవెంట్రుకల జుట్టు. కుడిచేతిమీద పుట్టుమచ్చ, మణికట్టు వద్ద పచ్చబొట్టు ఉంది. మృతుడు తెల్లరంగు హాఫ్ టీషర్టు, నీలంరంగు ఫుల్‌డ్రాయర్, నల్లరంగు ట్రాక్‌ప్యాంటు, ఎడమ చెవికి బంగారురంగు చెవికమ్మ ధరించి ఉన్నాడు. పంచనామా అనంతరం మృతుడు శవాన్ని ప్రభుత్వ ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మార్చురీలో భద్రపరిచినట్లు, మృతుడు సంబంధీకులు నాంపల్లి జీఆర్‌పి పోలీసుస్టేషన్ నంబరు 040-23202238 లేదా హెడ్‌కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసులు మొబైల్ నంబరు 7901151889లో సంప్రదించవచ్చునని తెలిపారు.

ఆటో డ్రైవర్‌లు ట్రాఫిక్ నియమాలను పాటించాలి
- ట్రాఫిక్ డిసిపి కరుణాకర్

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 19, ప్రభాతవార్త : ఆటో డ్రైవర్‌లు, చిరు వ్యాపారస్తులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని దక్షిణ మండలం ట్రాఫిక్ డిసిపి కరుణాకర్ సూచించారు. ఆపరేషన్ రోప్‌లో భాగంగా బుధవారం చార్మినార్‌లో ఆటో డ్రైవర్‌లు, చిరు వ్యాపారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డిసిపి కరుణాకర్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. రోడ్లపై ఉన్న ఫ్రీ లెఫ్ట్ అడ్డంకులు, స్టాఫ్ లైన్స్ వాయిలెన్స్ సృష్టించే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చలాన్‌లు విధించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనర్ డిసిపి ప్రసాద్‌రావు, చార్మినార్ ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.ఎస్.రవి, ఆటో డ్రైవర్‌లు, చిరు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి కరుణాకర్

సీసీఎస్‌లో వెంటనే ఎన్నికలు జరపాలి
- టిఎస్ఆర్‌టిసి జేఏసీ ధర్నా

చిక్కడపల్లి, అక్టోబరు 19, ప్రభాతవార్త : ఆర్టీసి సిబ్బంది పొదుపు చేసుకున్న డబ్బులను యాజమాన్యం వాడుకుని ఇవ్వని సందర్భంగా, సీసీఎస్‌లో వెంటనే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసి జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం విఎస్టీ వద్ద ఉన్న తెలంగాణ ఆర్టీసి కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయం ముందు పెద్దఎత్తున ధర్నా నిర్వహించింది. ఈ ధర్నా కార్యక్రమంలో టిఎస్ఆర్టీసి జేఏసీ చైర్మన్ కె.రాజిరెడ్డి, వైస్‌చైర్మన్ హన్మంత్‌మూదిరాజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసి యాజమాన్యం బకాయిలను వెంటనే సిసిఎస్‌కు చెల్లించాలని, ఇప్పటివరకు ఏనెలకుకానెల కార్మికుల నుంచి రికవరీ చేసిన డబ్బులు ఆర్టీసి యాజమాన్యం అదేనెలలో సీసీఎస్‌కు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో కన్వీనర్ సురేశ్, కోకన్వీనర్ కత్తుల యాదయనయ, గుడిసెల అబ్రహం, డి.గోపాల్, వీరాజంనేయులు, వెంకన్న, జక్కరయ్య, స్వాములయ్య, బిఆర్.రెడ్డి వందలాది మందిది జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహించిన దృశ్యం

ఫ్లోరైడ్ బాధితులను ఆదుకున్న ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వానిదే
- దుశ్చర్ల సత్యనారాయణ, కంచుకట్ల సుభాష్

హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త : నల్గొండలో ఫ్లోరైడ్ నివారణకు కృషి చేస్తూ ఫ్లోరోసిస్ బాధితులను అదుకున్న ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని జాతీయ జలసాధన సమితి అధ్యక్షులు దుశ్చర్ల సత్యనారాయణ, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి కన్వీనర్ కంచుకట్ల సుభాష్ అన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫ్లోరైడ్ బాధితులు స్వామి, తిరుపతమ్మ తదితరులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరల్డ్ ఆర్గనైజేషన్ ప్రకారం ప్రపంచంలో అత్యధికంగా ఫ్లోరైడ్‌ఉన్న ప్రాంతంగా నల్గొండ ఉందని ఇప్పటివరకు పనిచేస్తున్న ప్రభుత్వాలు ఏపీ ఈప్రాంతాలను పట్టించుకోలేదన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో ఫ్లోరైడ్ విముక్తికి కృషి చేశారన్నారు. ముఖ్యంగా తెలంగాణలో ఫ్లోరైడ్ కేంద్రాన్ని నెలకొల్పకుండా బిజెపి ప్రభుత్వం అడ్డుకుందని అలాంటి పార్టీకి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. మునుగోడు ఎన్నికల్లో అధికారపార్టీ అభ్యర్థిని గెలిపించాలని వారు పిలుపునిచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

వైద్యాధికారులు సమయ పాలన పాటించాలి
- జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 19, ప్రభాతవార్త : జిల్లాలోని వైద్యాధికారులు సమయ పాలన పాటించాలని, వారంలో ప్రతి బుధవారం, శనివారం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ వారిని ఆదేశించారు. బుధవారం మేడ్చల్ జిల్లా నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ప్రోగ్రామ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో ఇమ్యునైజేషన్, సబ్‌సెంటర్, కార్యకలాపాలను కూడా పర్యవేక్షించాలని వైద్యాధికారులకు స్పష్టం చేశారు. 9నుంచి 4గంటల మధ్య పేషంట్స్‌హెల్త్ కేర్ సేవలను విడివిపెట్టి జిల్లా కార్యాలయాన్ని సందర్శించొద్దని, అవసరమైతే కార్యాలయ అసిస్టెంట్ లేదా అకౌంటెంట్‌ను పంపాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను మెరుగుపర్చాలన్నారు. కెసిఆర్ కిట్స్ 1వ త్రైమాసిక రిజిస్ట్రేషన్లను అప్‌డేట్‌లు 95శాతం కన్నా ఎక్కువగా ఉండాలన్నారు. ప్రసవాల తనిఖీ 100శాతం ఉండాలన్నారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంపై జిల్లాలోని ఎస్‌టిఎల్ఎస్, ఎస్‌టిఎస్‌లతో నేరుగా లబ్దిదారుల బదిలీ గురించి సమీక్షించామన్నారు. వందశాతం డిబిటిని సాధించాలని వారిని ఆయన ఆదేశించారు. రాత్రి 9నుంచి4గంటల మధ్య ఏ మెడికల్ ఆఫీసర్ ప్రైవేట్ ప్రాక్టీస్ చేయకూడదని, వారి విధుల పట్ల అంకితభావంతో ఉండాలన్నారు. అన్ని బస్తీ దావాఖానాలు తెలంగాణ డయాగ్నోస్టిక్స్ టెలికన్సల్టేషన్‌లు,ఇ ఔషది అప్‌డేషన్‌లను పెంచాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి వైద్యాధికారులు సి-సెక్షన్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. జిల్లాలో సి-సెక్షన్ శాతాన్ని తగ్గించాలని ఆదేశించారు. మేడ్చల్ జిల్లాలో 100శాతం సాధారణ ప్రసవాలే లక్ష్యంగా పనిచేయాలని వైద్యాధికారులకు సూచించారు.

యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ లైన్‌లు క్లియర్ చేయాలి
- కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త : ఇటీవల రోజు కురుస్తున్న వర్షాలకు హిమాయత్‌నగర్ డివిజన్‌లో డ్రైనేజి పొంగిపోర్లుతున్నదని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురువుతున్నారని డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీ రా మన్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. బుధవారం ఆమె హిమాయత్‌నగర్‌లోని స్ట్రీట్ నెంబరు 8, 9, మల్లికార్జున్‌నగర్ తదితర బస్తీలలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ పొంగిపోర్లుతున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న హోటళ్ళవల్లనే డ్రైనేజీ పొంగుతున్నదని స్థానికులు తెలిపారు. దీంతో ఆమె అధికారులను, హోటల్స్ యజమానులు పిలిపించి ప్రత్యేకంగా లైన్ వేసుకోవాలని సూచించారు. అధికారులు తక్షణమే డ్రైనేజీ లైన్‌లను క్లియిర్ చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌ముదిరాజ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ లైన్ చూపిస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

మద్యంతాగి వాహనాలు నడిపితే జైలే
- ఇన్‌స్పెక్టర్ నానూనాయక్

చిక్కడపల్లి, అక్టోబరు 19, ప్రభాతవార్త : చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలో డ్రంకన్ డ్రైవ్‌లో పెద్దఎత్తున కేసులు నమోదు చేస్తున్నట్లు స్థానిక ఇన్‌స్పెక్టర్ నానూనాయక్ వివరించారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని, ఒక వేళ మద్యం సేవించి డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడితే సుమారు 30 ఎంజి దాటితే డ్రంక్ అండ్ డ్రైవ్ నియమ నిబంధనల ప్రకారం చట్టరీత్యా చర్యలు చేపడుతామని హెచ్చరించారు. అలాగే బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో రీడింగ్ 200లకుపైగా వస్తే జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. అయినప్పటికీ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మూడుసారఱ్లు పట్టుపడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని, అలాగే మద్యం తాగి పట్టుబడి మొదటిసారి జైలుశిక్ష అనుభవించినప్పటికీ తీరు మార్చుకోక మళ్లీమళ్లీ మద్యం తాగి పట్టుబడితే జైలు శిక్షకాలం కూడా పెరుగుతుందని, ఇటువంటి అంశాలను గుర్తుంచుకుని ఎవరూ కూడా మద్యం సేవించి వాహనాలను నడపరాదని, తద్వారా తాము ఇబ్బంది పడుతూ కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేయడం సబబుకాదని అన్నారు. అలాగే పలు సందర్భాల్లో మద్యమత్తులో వాహనాలను నడుపుతూ అనుకొని ప్రమాదాలకు కారణమవుతూ ఇతరుల జీవితాలతో పాటు తమ జీవితాలను ఇబ్బందులకు గురిచేసుకోవద్దన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

నాంపల్లి, అక్టోబరు 19, ప్రభాతవార్త : అనారోగ్యంతో లింగంపల్లి రైల్వేస్టేషన్ 6వ నంబరు ప్లాట్‌ఫామ్, మధ్య గేట్‌సమీపంలో 31వ నంబరు ఇనుపదిమ్మ దగ్గర సహజ మరణం చెందాడు. మృతుడు వయస్సు 35-40, ఎత్తు 5.5 అడుగులు. బ్రౌన్‌కలర్ జుట్టు, కోలముఖం. కడుపుమీ ద పుట్టుమచ్చ ఉంది. మృతుడు తెలుపురంగు గీతల ఫుల్‌షర్టు, తెల్లరంగు హాఫ్ బనియన్, నల్లరంగు మొలత్రాడు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మార్చురీలో భద్రపరిచినట్లు, మృతుడు సంబంధీకులు పూర్తి వివరాలకు నాంపల్లి జీఆర్‌పి పోలీసుస్టేషన్ నంబరు 040-23202238 లేదా హెడ్‌కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసు నంబరు 7901151889లో సంప్రదించవచ్చునని తెలిపారు.

పద్యభాషి, పద్యమౌళి డాక్టర్ రాధశ్రీ

చిక్కడపల్లి, అక్టోబరు 19, ప్రభాతవార్త : సాధన సాహితీస్రవంతి ఆధ్వర్యం లో పద్యభాషి-పద్య మౌళి డాక్టర్ రాధశ్రీ సాహిత్య స్వర్ణోత్సవం సందర్భంగా 'రాధశ్రీ రోచిస్సులు' కావ్యావిష్కరణ, రసవాహిని రాధశ్రీ వెబ్‌సైట్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వాహక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సాధన నరసింహాచార్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన 'సాహిత్య స్వర్ణోత్సవ అభినందన' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి హాజరై రాధశ్రీ ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివేకానంద సేవాసమితతి చైర్మన్ సిహెచ్.హనుమంతరావు, అశ్విని సంస్థల అధినేత అశ్విని సుబ్బారావు పాల్గొనగా పుస్తకాన్ని ఎం.సూర్యనారాయణమూర్తి సమీక్షించగా వెబ్‌సైట్‌ను డాక్టర్ బోలుగద్దె అనీల్‌కుమార్ ప్రారంభించారు. మరుమామూల దత్తాత్రేయ శర్మ నిర్వహణలో కవిసమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి ముందు 'రాధశ్రీ సాహిత్య సమాలోచన సదస్సు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ టి.గౌరీశంకర్ నిర్వహణలో జరిగింది. రాధశ్రీ పద్యవైచిత్రి గురించి డాక్టర్ వెనిగళ్ళ రాంబాబు, రాధశ్రీ వచన కవితలపై డాక్టర్ బి.జయరాములు, రాధశ్రీ సాహిత్య వ్యక్తిత్వంపై కందూర్ చంద్రప్రకాశ్ గుప్త, రాధశ్రీ శతకాలుపై అవధాని ముద్దు రాజయ్య ప్రసంగించారు.

రాధశ్రీని సత్కరిస్తున్న ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

బిజెపిలో చేరిన మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు నర్సాగౌడ్

హైదరాబాద్, అక్టోబరు 19, ప్రభాతవార్త : తెలంగాణ గౌడసంఘాల జేఏసీ చైర్మన్, మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ బిజెపిలో చేరారు. ఈమేరకు బుధవారం ఢిల్లీలోని బిజెపి జాతీయ కార్యాలయంలో కేంద్ర మంత్రులు భూపేందర్ యాదవ్, కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఇంచార్జ్ తరుణ్‌చుగ్, రాష్ట్ర అధ్యక్షులు బండిసంజయ్, ఈటెల రాజేందర్‌ల సమక్షంలో కండువా కప్పుకున్నారు. ఈసందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నర్సాగౌడ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా నర్సాగౌడ్ మాట్లాడుతూ గత 25సంవత్సరాల నుంచి వివిధ ప్రజాసంఘాలలో పనిచేయడంతోపాటు గౌడకులస్తుల సమస్యల పరిష్కారం కోసం బిసిల హక్కుల రక్షణకు పనిచేసి బిజెపితోనే బడుగులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, తూళ్ల వీరేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి, తరుణ్‌చుగ్

పర్యటిస్తున్న తహశీల్దార్ శైలజా, టీ.ఎన్.

పెండింగ్‌లో ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు తక్షణమే నిర్మించాలి

కంటోన్మెంట్, అక్టోబర్ 19, ప్రభాతవార్త : 2వ వార్డు రసూల్‌పురా నారాయణ జోపడి సంఘం ప్రాంతాల్లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను బుధవారం సికింద్రాబాద్ తహశీల్దార్ శైలజా, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు. స్థానికంగా నివాసం ఉంటున్న 5 మంది కోర్టును ఆశ్రయించడంతో లబ్ధిదారులకు నిర్మించాల్సిన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు నిలిచిపోయాయని టీ.ఎన్. తహశీల్దార్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు నాగరాజు, కుమార్ గౌడ్, షపాలీ, గఫూర్, వాహబ్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలి

కొత్తూర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త : తడి, పొడి చెత్తపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ తెలిపారు. కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ-2లో తడి,పొడి చెత్త ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ పాల్గొని బుధవారం తడి, పొడి చెత్తపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ....మహిళలు ఇళ్ల నుంచి చెత్త పారవేసే ముందు తడి,పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ ఉంచి ఇంటి ముందుకొచ్చే మున్సిపల్ ట్రాక్టర్‌లో వేయాలన్నారు. ప్రతి ఒక్కరు నియమ నిబంధనలను పాటించి స్వచ్ఛత కోసం సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వీరేందర్, వైస్‌చైర్మెన్ డోలి రవీందర్, కౌన్సిలర్ బ్యాగరి ప్రసన్నలతయాదయ్య, కుమ్మరిగూడెం బిక్షపతి, సిటీ కేబుల్ వెంకటేష్, దాసరి నరసింహ్మ, బండి శ్రావణ్, కాజా, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళలు తదితరులు ఉన్నారు.

అభ్యాసకేంద్రీకరణ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త : విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా నైపుణ్యతను పెంపొందించుకోవాలని అనురాగ్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.రామచంద్రం అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో బుధవారం స్కూల్ ఆఫ్ మెనేజ్‌మెంట్‌లో బిబిఏ విద్యార్థుల రెండోబ్యాచ్‌కు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కొత్త బ్యాచ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు పలువురు హాజరయ్యారు. ఏయూ వీసీ రామచంద్రం విచ్చేసి మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ రంగంలో వస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ ఉట్ల బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రవర్తన, ఎంపికలు, నిర్ణయాలపై యాజమాన్యం భాధ్యత వహించాలని సూచించారు. బిబిఏ ప్రోగ్రామ్ డైరక్టర్ పిఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ భవిష్యత్తు కెరీర్‌లకు గేట్‌వేగా ఉంటుందని సీఏ, సీఎస్ వంటి ప్రత్యేక ప్రోగ్రామ్‌లపై ఆయన వివరించారు. బిబిఏ మొదటి బ్యాచ్‌లోని విద్యార్థులు క్యాంపస్‌లో నిర్వహిస్తున్న మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌లో పాల్గొనడం, ప్రాక్టికల్ లెర్నింగ్‌లపై ప్రదర్శను అందించారు.

వినతిపత్రం అందజేస్తున్న 3వ వార్డు సభ్యులు

గొల్లకురుమ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తాం

కంటోన్మెంట్, అక్టోబర్ 19, ప్రభాతవార్త : కంటోన్మెంట్ 3వ వార్డులో గొల్లకురుమ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బిజెపి మహంకాలి జిల్లా అధికార ప్రతినిధి బి.ఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గొల్లకురుమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

7వ వార్డు హన్‌మాన్ టెంపుల్ స్థలంపై సర్వే జరపాలి

కంటోన్మెంట్, అక్టోబర్ 19, ప్రభాతవార్త : కంటోన్మెంట్ 7వ వార్డు తిరుమలగిరిలో మిలటరీ ఆర్మీ సరిహద్దుల్లో ఉన్న హన్‌మాన్ దేవాలయం స్థలంపై సర్వే నిర్వహించాలని టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు రంగ రవిందర్ గుప్త బుధవారం తిరుమలగిరి తహశీల్దార్ హసీనా బేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు జార్జి, శేఖర్, సదానంద్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న రంగ రవిందర్ గుప్త

మునుగోడు ఎన్నికల ప్రచారానికి తరలిన ముషీరాబాద్ బిజెపి నేతలు

చిక్కడపల్లి, అక్టోబరు 19, ప్రభాతవార్త : ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో బిజెపి కార్యకర్తలు, నాయకులు మునుగోడు ఉప ఎన్నికల్లో ప్రచారానికి బిజెపి నగర నాయకుడు, చౌటుప్పల్ మున్సిపల్ వార్డు-10 ఇంచార్జ్ ఎ.వినయ్‌కుమార్‌తో కలిసి బుధవారం వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గుర్తు 'కమలం'పై వేసి గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ప్రచారాన్ని మొదలుపెట్టారు. ప్రతి ఒక్కరు బిజెపికి ఓటు వేయాలని అభ్యర్థించారు. బిజెపి నాయకులు, శక్తికేంద్రం ఇంచార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, బిజెవైఎం నేతలు పాల్గొన్నారు.

జాతీయ కవి బోయి భీమన్న
- తెలంగాణ అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి

ఎస్వీ.రామారావుకు పురస్కారాన్ని అందిస్తున్న మంత్రి శ్రీదేవి తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 19, ప్రభాతవార్త : రచయితగా, కవిగా, పాత్రికేయులుగా, విద్యావేత్తగా అనేక రచనలు చేసిన గొప్ప వ్యక్తి బోయి భీమన్న అని తెలంగాణ అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి అన్నారు. బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో పద్మభూషణ్, సుప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ బోయిభీమన్న 112వ జయంతి సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు ఆచార్య ఎస్వీ.రామారావుకు భీమన్న పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ వెలుదండ నిత్యానందరావు అధ్యక్షతన జరిగింది. ఈ పురస్కారాన్ని అందించిన అనంతరం మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప కవి అని అన్నారు. ఈ కార్యక్రమంలో త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి, భీమన్న సాహితి నిధి అధినేత్రి, ప్రముఖ గాయనీ హైమావతి భీమన్న, కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఆచార్య గోనానాయక్, ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు సహాయ ఆచార్యులు డ

నాణ్యతతో కూడిన అభివృద్ధి

కార్పొరేటర్ జితేందర్‌నాథ్

సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

అల్వాల్, అక్టోబరు 19 ప్రభాతవార్త: నాణ్యతతో కూడిన అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఉంటుందని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. బుధవారం సంజీవ్ రెడ్డి గార్డెన్ సత్యం కాలనీ ప్రధాన రహదారి హైటెన్షనల్ , పంచ్‌షీల్, విబిఆర్, హెచ్ఎంటి, లయోలా కళాశాల రోడ్డు మరమత్తు పనులను అధికార యంత్రాంగంతో కలిసి పరిశీలిం చడం జరిగింది. భారీ వర్షాలు కారణంగా పాడైన రోడ్లను ప్రజ లకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టామని జితేందర్‌నాథ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఇ రాజు, డిఇ మహేష్, రాజ్యలక్ష్మీ, ఎఇ రవళి టిఆర్ఎస్ నేతలు సురేందర్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలం, పరమేష్, శ్రావణ్, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పెన్షన్లు పంపిణి

అసరా పెన్షన్లను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే

హైదరాబాద్, అక్టోబరు 19 ప్రభాతవార్త: అసరా పెన్షన్‌లను లబ్ధిదారులకు బుధవారం కాచిగూడలోని తుల్జాభవన్‌లో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, ఎంఆర్ఓ, డిప్యూటి ఎంఆర్ఓ, డివిజన్ అధ్యక్షుడు భీష్మ, టిఆర్ఎస్ నాయకులు ఓంప్రకాష్ యాదవ్, సదానంద్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

యుజిడి పనులు పరిశీలించిన కార్పొరేటర్

యుజిడిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్

అల్వాల్, అక్టోబరు 19 ప్రభాతవార్త: వెంకటాపురం డివిజన్ సుభాష్‌నగరలో 12 లక్షలు వ్యయంతో ఏర్పాటు చేస్తున్న యుజిడి పనులను కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ బుధవారం పరిశీలించారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీకి తావు ఉండకూడదని అధికారులకు ఆమె స్పష్టం చేశారు. అభివృద్ధికి ప్రజలు సహకారం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఇ రాజు, డిఇ కార్తీక్ ఎఇ అరుణ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రావు టిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, భాస్కర్, రఘునాథ్, ప్రభాకర్, శ్యామ్‌సుందర్, ఆనంద్‌రావు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో తెలంగాణలోని విశ్వవిద్యాలయాలు

టి-జాక్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం

సైఫాబాద్, అక్టోబరు 19 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన ఉండి పోరాటం చేసిన విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, విద్యార్థులు, నిరుద్యోగులు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి (టి-జాక్) రాష్ట్ర ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులు లేక బోధన పూర్తిగా కుంటుపడిందని, రోజురోజుకు అధ్యాపకులు రిటైర్ అవుతున్నారని, ఏర్పడిన ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయకపోవడం దారుణమన్నారు. ఒక్క ఉస్మానియా యూనివర్సిటిలోనే 1268 పోస్టులకు గాను 390 మంది అధ్యాపకులతో బోధన కొనసాగుతున్నదని, ఇందులో సగం మంది అడ్మినిస్ట్రేటివ్ పోస్టులతోనే సతమతవుతున్నారని తెలిపారు. ప్రభు త్వం రిక్రూట్‌మెంట్ చేస్తామని గత 8 సంవత్సరాలుగా చెపుతున్నదని, ప్రభుత్వం వేసిన కమిటి రెండువేలకు పైచిలుకు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రకటించిందని వాటిని భర్తీ చేయకపోవడంతో బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్ల వయోపరిమితిని పెంచిన ప్రభుత్వం ఇతర విశ్వవిద్యాలయాలకు వర్తింపజేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తక్షణమే విశ్వవిద్యాలయాల్లో వయోపరిమితిని 65 ఏళ్ళకు పెంచాలని, ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని పురుషోత్తం డిమాండ్ చేశారు.

చిన్న పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడం క్షమించరాని నేరం

సైఫాబాద్, అక్టోబరు 19 ప్రభాతవార్త: చిన్నపిల్లలపై లైంగిక దాడులు చేసే కామాంధులను కఠినంగా శిక్షించాలని ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నెంబరు 14లోని డ్యావ్ స్కూల్ ప్రిన్సిపల్ డ్రైవర్‌అయిన రజనీకాంత్ స్కూల్‌లో చదువుతున్న ఎల్‌కెజి చిన్నారిపై అత్యాచార యత్నం చేయడం క్షమించరాని నేరమని, ఇటువంటి కామాంధులను కఠినంగా శిక్షించాలని ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలకు ఫీజులపైన ఉన్న శ్రద్ధ అందులో చదుకునే చిన్నారులు, అమ్మాయిలపై లేకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. చిన్నారిపై దారుణానికి పాల్పడిన నిందితుడి తో పాటు స్కూల్ యాజమాన్యాన్ని కూడా అరెస్టు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

కుత్బుల్లాపూర్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా వేముల సురేశ్

కుత్బుల్లాపూర్, అక్టోబరు 19 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా గాజులరామారంకు చెందిన వేముల సురేశ్ గెలుపొందారు. బుధవారం సర్కిల్‌లో జరిగిన కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కాంట్రాక్టర్స్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో వేముల సురేశ్ సమీప ప్రత్యర్థిపై ఐదు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈసందర్భంగా వేముల సురేశ్ మాట్లాడుతూ అటు అధజకారులకు, ఇటు కాంట్రక్టర్లకు మధ్య సమన్వయం కుదురుస్తూ సకాలంలో పనులను పూర్తిచేసేందుకు కృషిచేస్తానని అన్నారు. అధికారులు, ప్రజాప్రతనిధుల సహాయ, సహకారాలతో కాంట్రాక్టర్లకు సుదీర్ఘ కాలంలో ఉన్న బిల్లుల చెల్లింపు సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధవహిస్తానని అన్నారు. ప్రజలు,అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే పనులు వేగవంతం అవుతాయని దీనికి ఒకరికి ఒకరు సహకరించుకునేందుకు వీలుగా కృషిచేస్తానని వేముల సురేశ్ తెలిపారు.

సనత్‌నగర్ నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 19, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సనత్‌నగర్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం అమీర్‌పేట డివిజన్‌లో 2 కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014కు ముందు నియోజకవర్గ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడేవారని, టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్‌ల సహకారంతో ఇప్పటి వరకు నియోజకవర్గం పరిధిలో సుమారు 1600కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. రహబదారులు, ఫుట్‌పాత్ల నిర్మాణం, అభివృద్ధి, నూతన మంచినీటి పైప్‌లైన్‌ల ఏర్పాటు, డ్రైనేజి వ్యవస్థ మెరుగుపర్చడం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే కనక దుర్గమ్మ దేవాలయం నుండి ఫతేనగర్ ఫ్లైఓవర్ వరకు ఉన్న రోడ్డును టిఆర్ఎస్ హయాంలోనే వెడల్పు చేసి నిర్మించడంతో పాటు డివైడర్‌లు, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసి ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, డిసి మోహ న్‌రెడ్డి, కార్పొరేటర్ సరళ, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఈఈ ఇందిర, వాటర్ వర్క్స్ జిఎం హరిశంకర్, ఏఎంహెచ్ఓ భార్గవ్ నారాయణ, టౌన్ ప్లానింగ్ రమేష్, డివిజన్ తెరాస అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్‌యాదవ్, సంతోష్‌మణికుమార్, సీనియర్ సిటీజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు సహదేవ్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, గుడిగే శ్రీనివాస్‌యాదవ్, హరిసింగ్‌జాదవ్, గోపిలాల్ చౌహాన్, బాసలక్ష్మీ, రాజేష్‌జాదవ్, కట్ట బలరాం, కూతురు నరసింహా తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణాలకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కుత్బుల్లాపూర్ మాజీ కౌన్సిలర్ ఇ.వి.సాగర్‌రావు

చింతల్ డివిజన్ సాగర్ ఎక్లేవ్‌లో నిర్వహించిన సమావేశంలో కుత్బుల్లాపూర్ మాజీ కౌన్సిలర్ ఇ.వి.సాగర్‌రావు తదితరులు

కుత్బుల్లాపూర్, అక్టోబరు 19 ప్రభాతవార్త : ఆధ్యాత్మిక అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతూ దేవాలయాల నిర్మాణాలు, అభివృద్ధికి ప్రతిఒక్కరూ ఇతోధిక సహాయ, సహకారాలను అందించాలని కుత్బుల్లాపూర్ మాజీ కౌన్సిలర్ ఇ.వి.సాగర్‌రావు కోరారు. బుధవారం చింతల్ డివిజన్ సాగర్‌ఎక్లేవ్‌లో మంగల్‌పర్తి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మంగల్‌పర్తి ముదిరాజ్ జై పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇ.వి.సాగర్‌రావు మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధితోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి త్వరితగతిన పూర్తికావాలని కోరారు. ఈసందర్భంగా మంగల్‌పర్తి ముదిరాజ్ జై పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ కమిటీ ముఖ్య సలహాదారులు గుమ్మల స్వామి ముదిరాజ్, అధ్యక్షులు గుమ్ముల సత్యనారాయణ ముదిరాజ్, ప్రధానకార్యదర్శి మన్నె నర్సింహులు ముదిరాజ్, ఉపాధక్షులు చింతల ప్రవీణ్ ముదిరాజ్, కోశాధికారి బుర్క సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులు మిర్జపల్లి కరుణాకర్ ముదిరాజ్, చింతల ప్రభాకర్ ముదిరాజ్, కార్యనిర్వాహక కార్యదర్శులు సింగరబ ఓయిన నర్సింహులు ముదిరాజ్, నర్రసత్తయ్య ముదిరా్, కార్యవర్గ సభ్యులు నారాయణ నాగేంద్ర ముదిరాజ్, గట్టుక్రింది చంద్రయ్య ముదిరాజ్, తలారి సత్తయ్య ముదిరాజ్, చింతల శ్రీను ముదిరాజ్, మానెపల్లి స్వామి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దఎత్తున జోడో యాత్రలో పాల్గొన్నాలి

మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్

బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్

ధర్నాచౌక్, అక్టోబర్ 19, ప్రభాతవార్త: రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని టీ.పీ.సీ.సీ. వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం ముషీరాబాదన నియోజకవర్గంలో దోమలగూడ నుండి భారత్ జోడో యాత్ర విజయవంతం చేయాలనే నినాదంతో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ భారత్ జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ నవంబర్ 1 న హైదరాబాద్ వస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ పెద్ద ఎత్తున జోడో యాత్రలో పాల్గొనాలని కోరారు. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్‌కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్‌లు వాజిద్ హుస్సేన్, కల్పనాయాదవ్, కాంగ్రెస్ నాయకులు వి.డి.కృష్ణ, గుజ్జెల రుషీకేష్, సేలం సత్యనారాయణ, పాశం అనిల్ యాదవ్, గుర్రం శంకర్, జాఫర్, మేడి సురేష్, అభిషేక్, తిరుమల్, ప్రవీణ్‌రెడ్డి, మురళి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నాము

కోకాపేట్ కౌన్సిలర్ గంగిడి శివారెడ్డి

కోకాపేట్‌లో రూ.5లక్షలతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజి పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ గంగిడి శివారెడ్డి

నార్సింగి, అక్టోబర్ 19 ప్రభాతవార్త : ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని కోకాపేట్ కౌన్సిలర్ గంగిడి శివారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నార్సింగి మున్సిపల్ పరిధిలోని కోకాపేట్‌లో రూ.5.లక్షలతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఎన్ని కల వేళ కోకాపేట్ వాసులకు ఇచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపిస్తున్నామన్నారు. ముఖ్యంగా మౌళిక వసతులైన మంచినీరు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు వంటి వాటికి పెద్దపీఠ వేస్తున్నామని వివరించారు. ఎల్లవేళలా ప్రజలకు అందు బాటులో ఉండి వారి ఇబ్బందులు దూరం చేస్తున్నామన్నాని, ప్రజలు నాపై పెట్టుకున్న విశ్వాసంను మరింత పెంచుకునేందుకు అంకిత భావంతో పని చేస్తున్నామని కౌన్సిలర్ శివారెడ్డి తెలిపారు. శివారెడ్డి పని తీరు పట్ల స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా మా వద్దకు వచ్చి వెంటనే పరిష్కరిస్తున్నారని, ఎన్నికల్లో మేము వేసిన ఓట్లు మాకు మేలు చేస్తున్నాయని కోకాపేట్ వాసులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు సాంబశివ, శానిటేషన్ ప్రతినిధి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడిన నిందితుడికి రిమాండ్

పేట్‌బషీరాబాద్,అక్టోబర్19 ప్రభాతవార్త: గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న రాజు అనే వ్యక్తి అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నాడని పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారి విజయ్‌భాస్కర్ ఆదేశాల మేరకు సోదాలు నిర్వహించామని తెలిపారు. ఈ సోదాలో నిందితుడు రాజు నుంచి 1.150 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని అన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాలు సేవించడం, కలిగిం ఉండడం చట్టరిత్య నేరము, శిక్షార్హహ మని కావున ప్రజలందరు ముఖ్యంగా యువత దూరంగా ఉండాని అధికారులు సూచించారు. ఈ దాడుల్లో ఎస్‌హెచ్ఓ టి.యాదయ్య, ఎం.వి అనిల్‌కుమార్, ఎం.షర్మిళ, కె.సీ తారాం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బిజెపిలో చేరిన కూకట్‌పల్లి నేత వడ్డేపల్లి రాజేశ్వరరావు

వడ్డేపల్లి రాజేశ్వరరావును అభినందిస్తున్న ఈటెల రాజేందర్

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 19, ప్రభాతవార్త : కూకట్‌పల్లికి చెందిన సీనియర్ నాయకులు దివంగత నేత వడ్డేపల్లి నర్సింగ్‌రావు తనయుడు తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు భారతీయ జనతా పార్టీలో చేరారు. బుధవారం ఢిల్లీలో హుజురాబాద్ శాసనసభ్యులు ఈటల రాజేందర్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ శాలువా కప్పి వడ్డేపల్లి రాజేశ్వరరావును పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ కూకట్‌పల్లి ప్రాంతంలో వడ్డేపల్లి నర్సింగ్‌రావు నిరంతరం ప్రజా సంక్షేమాన్ని కోరుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పరోక్షంగా ప్రజాసేవ చేవారని కొనియాడారు. భారతీయ జనతా పార్టీకి యువరక్తం కావాలని యువకుడైన వడ్డేపల్లి రాజేశ్వరరావు పార్టీలోకి రావడం అభినందనీయమని అన్నారు. కూకట్‌పల్లి ప్రాంతంలో సీనియర్ నాయకులతో పాటు బిజెపి కార్యకర్తలు, నాయకులను కలుపుకొని భాజపా బలోపేతానికి తనవంతు కృషి చేయాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, కూకట్‌పల్లి బిజెపి ఇన్‌చార్జీ మాధవరం కాంతారావు, బిజెపి యువ నాయకులు గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్‌క్రైమ్ ఉమెన్స్ సేఫ్టీ శిక్షణ

యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైబర్‌క్రైమ్ ఉమెన్స్ సేఫ్టీ శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ నర్సింహా

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 19, ప్రభాతవార్త : తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్ షీ టీమ్ 2021,22 గాను ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, ఉమెన్స్ సేఫ్టీ గురించి ఆన్‌లైన్‌లో సంవత్సరం పాటు శిక్షణ ఇచ్చారు. ఈశిక్షణకు నగరంలోని ప్రతి పాఠశాలనుంచి ఇద్దరు విద్యార్థులను ఒక మెంటర్ టీచర్‌ను సెలక్ట్ చేసి ఒక సంవత్సరం పాటు ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారు. ఇందుకు గాను యూసుఫ్‌గూడకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మేఘన, బాలాజి విషాల్, సైబర్ అబ్జర్వర్‌గా పాఠశాల ఎన్‌సిసి అధికారి ప్రభాకర్ మెంటర్ టీచర్‌గా శిక్షణ తీసుకున్నారు. పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్ షీ టీమ్ ప్రాధాన్యాతను తెలియజేశారు. ఇందుకు గాను బుధవారం పాఠశాలలో పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్ మాస్టర్ నర్సింహా, సైబర్ అబ్జర్వర్‌గా మేఘన, బాలాజీ మెంటర్ టీచర్‌గా ప్రభాకర్‌కు సర్టిఫికెట్‌లను అందజేశారు.

స్మశాన వాటికలను సుందరీకరణంగా తీర్చిదిద్దుతున్నాం

రాజీవ్‌గాంధీనగర్‌లో ముస్లిం స్మశాన వాటికలో నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 19, ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని మతాల స్మశాన వాటికలను సుందరీకరణంగా తీర్చిదిద్దడం జరుగుతుందని కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్ అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ నగర్‌లో ముస్లిం స్మశాన వాటికను కార్పొరేటర్ సంబందిత అధికారుతో కలిసి సందర్శించారు. స్మశాన వాటికలో చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి మురుగు నీరు చేరుతుందని మధ్యలో నుంచి నాలా ఉండటం వలన వర్షాలు పడినపుడు అల్లా వరదనీరు పొంగి స్మశాన వాటికలో బురదమయంగా మారుతుందని దాని మొత్తాన్ని ప్రణాళిక బద్దంగా సుందరపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఇప్పటికే కోట్లాదిరూపాయలతో హిందు స్మశాన వాటికలను క్రిస్టియన్‌ల స్మశాన వాటికలను అభివృద్ధి పరచడం జరిగిందని ప్రస్తుతం ముస్లిం స్మశాన వాటికను కూడా ఆదూనికరిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీసెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్, ఏయిరంజిత్, వర్క్ ఇన్స్‌పెక్టర్ వినాయరావు, డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, సయ్యద్ రియాజ్, అస్లాం, హమీద్, జావేద్, నసీద్, చాంద్‌సాబ్, రజాక్, యోగిరాజు స్వామి, జుబేర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం అంజయ్యకు నివాళి

చిక్కడపల్లి, అక్టోబరు 19 ప్రభాతవార్త: మాజీ ముఖ్య మంత్రి టంగుటూరి అంజయ్య వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, వల్లాల శ్యామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన: కౌన్సిలర్ విజయ్‌బాబు

కోకాపేట్‌లోని సబితానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో బిపీ పరీక్షించుకుంటున్న కౌన్సిలర్ విజయ్‌బాబు

నార్సింగి, అక్టోబర్ 19 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపాలి టీ పరిధిలోని కోకాపేట్ సబితా నగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని స్థానిక కౌన్సిలర్ విజయ్‌బాబు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో తను స్వయంగా పాల్గొని బిపి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని తెలిపారు. ఆరోగ్యంపై ప్రతీ ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆదాయంతో పాటు ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. ఆదాయం కోసం రోజులో 8.నుంచి 10.గంటల పాటు కష్టపడుతున్న నగర వాసులు ఆరోగ్యంపై కూడా రోజులో కనీసం గంట సమయంను కేటాయించాలన్నారు. ఉదయాన్నే వాకింగ్, కసరత్తు, వ్యాయామం, యోగ, ఆసనాలు, ప్రాణాయామం వంటివి క్రమం తప్పకుండా చేసుకుంటే రోజంతా ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. జన్ సాహస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జ్వరం, దగ్గు, జలుబు తదితర జబ్బులపై పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వీరికి ఉచితంగానే మందులు పంపిణీ చేశామని కౌన్సిలర్ విజయ్‌బాబు వివరించారు.

భారత్ జోడో యాత్రను విజయ వంతం చేయండి : విహెచ్

కార్యక్రమంలో పాల్గొన్న ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరీ,మాజీ ఎంపి హనుమంతరావు,క్రాంతి కుమార్ తదితరులు

చార్మినార్,అక్టోబరు 19 ప్రభాతవార్త : కాంగ్రెస్ అగ్రనేత ఎంపి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఈ నెల 23వ తేదీన తెలంగాణలో ప్రవేశించనున్న సందర్భంగా మాజీ ఎంపి హనుహంతరావు ప్రత్యేకంగా భారత్ జోడో యాత్ర వాహనంను తయారు చేయించారు.చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరం వద్ద బుధవారం భారత్ జోడో యాత్ర వాహనానికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ జోడో యాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరీ వాహనాన్ని పరిశీలించి మాజీ ఎంపి హనుమంతరావును అభినంధించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఆర్.దామోదర్‌డ్డి,చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎం.కోదండరెడ్డి,జి.నిరంజన్,ఆదం సంతోష్,ఎస్.పి.క్రాంతి కుమార్,ఎస్.శ్రీ కాంత్ గౌడ్,అవినాష్, ఆర్.శివకుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం వి.హనుమంతరావు బస్సులో మహబూ బ్‌నగర్‌కు బయలు దేరి వెళ్లారు.

నాగార్జున్ గౌడ్ మృతి టిఆర్ఎస్‌కు తీరనిలోటు

అడ్డగుట్ట, అక్టోబర్ 19, ప్రభాతవార్త : అడ్డగుట్టకు చెందిన టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గౌడ సంఘం చీఫ్ ప్యాట్రన్ అంబాల నాగార్జున్ గౌడ్ మృతి చెందడం టిఆర్ఎస్ పార్టీకి, అడ్డగుట్ట గౌడ సంఘానికి తీరనిలోటని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తెలిపారు. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన నాగార్జున గౌడ్, బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మరణ వార్త తెలియగానే డిప్యూ టీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఆయ

జర్నలిస్టుల స్థలాన్ని కాపాడాలని తహసిల్దార్‌కు వినతి
క్రిమినల్ కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి

తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఎల్.బి.నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త : జర్నలిస్టులకు కేటాయించిన ప్రబుత్వ స్థలాన్ని మరోసారి కబ్జా చేసేందుకు స్థలంలో చొరబడుతున్న కబ్జాదారులపై చర్య తీసుకోవాలని లబ్ధిదారులైన జర్నలిస్టులు తహసిల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసిల్దార్ అనితారెడ్డిని కలిసి జర్నలిస్టులు వినతి పత్రాన్ని అందజేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని మునగనూరు గ్రామంలో ఉన్న సర్వేనెంబర్ 38/1లో జర్నలిస్టులకు ప్రబుత్వం పట్టాలను మంజూరు చేసింది. కాగా ప్రబుత్వ స్థలంలో కోందరు కబ్జాదారులు చొరబడి నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రబుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కబ్జాదారులు అక్రమాలకు పాల్పడుతున్నారని తహసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. స్థలాన్ని కబ్జా చేసేందుకు కుట్ర చేయడంతో పాటు జర్నలిస్టులపై భౌతికదాడులకు కూడా పాల్పడుతున్న వారిపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కబ్జాదారులపై క్రిమినల్ కేసు నమోదు చేసి లబ్ధిదారులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. అందుకు స్పందించిన తహసిల్దార్ అనితరెడ్డి రెవెన్యూ చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు ప్రవీణ్‌కుమార్, మేకల సత్యనారాయణ, తగరం సత్యనారాయణ, కటకం సుభాష్, చండీశ్వర్, జంగయ్య యాదవ్, పల్ల వెంకన్న, చెరుకు వెంకట్‌స్వామి, జగన్ గౌడ్, దుబ్బాక యాదయ్య, దీన్‌దయాల్, ముత్యాలు, శ్రీనివాసరావు, శ్రీనివాస్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, చందర్, సాగర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి : బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ పారిజాత

మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న బడంగ్‌పేట్ మేయర్ పారిజాత

సరూర్‌నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త: మహిళలు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం కిందకు వచ్చే బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 25వ డివిజన్‌లో రంగారెడ్డి జిల్లా జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలరింగ్, పచ్చళ్ళ తయారీ తదితర స్వయం ఉపాధి కార్యక్రమాల్లో శిక్షణ పొందిన మహిళలకు బుధవారం సర్టిఫికెట్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్‌ముందుగా మొక్కలు నాటి మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో పైకి ఎదగడానికి ప్రయత్నించాలనీ ఇందు కోసం ఆత్మ స్థైర్యం పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆర్థిక స్వావలంబన సాధించడానికి స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలని అన్నారు. ఉచిత శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకొని ప్రగతి సాధించాలని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ముత్యాల లలితా కృష్ణ, మాజీ సర్పంచ్ ముత్యాల కృష్ణ, తిరుమల సంస్థ డైరెక్టర్ రామ్మోహన్, కో-ఆర్డినేటర్ విజయ లక్ష్మి, మెప్మా రిసోర్స్ పర్సన్ రామిడి సరిత మహేందర్‌రెడ్డి, సునీత, సుష్మ, అనూరాధ, కవిత తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ రీడింగ్ రూంలు ఏర్పాటు చేయాలని గ్రంథాలయ సంస్థ తీర్మాణం

తీర్మాణాలు చేస్తున్న ఛైర్మన్ పాండురంగారెడ్డి, సభ్యులు

సరూర్‌నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సూచనల మేరకు రంగారెడ్డి జిల్లాలో రెండు వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో పబ్లిక్ రీడింగ్ రూంలు ఏర్పాటు చేయాలని రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సర్వ సభ్య సమావేశం తీర్మాణించింది. బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడలోని జిల్లా గ్రంథాలయ సంస్థ భవనంలో ఛైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన పాలకవర్గ సభ్యులు పలు తీర్మాణాలు చేశారు. ఇందులో భాగంగా అవసరమైన చోట్ల పబ్లిక్ రీడింగ్ రూమ్‌లు, గది వసతి లేని గ్రామాల్లో కంటైనర్‌లు ఏర్పాటు చేయాలని తీర్మాణించారు. అదే విధంగా జిల్లాలోని పలువురు ఎమ్మెల్యే సూచనల మేరకు గ్రంథాలయాల నూతన భవనాల కోసం నిధులు మంజూరు చేయాలని కూడా తీర్మాణం చేవారు. కొత్త గ్రంథాలయాల ఏర్పాటు కోసం మంజూరు నిమిత్తం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఛైర్మన్ పాండురంగారెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో ఏనుగు ఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పద్మశ్రీ, మనోజ్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో చక్కటి ఆరోగ్యం : డాక్టర్ అవంతిరావు

డాక్టర్ అవంతిరావుకు జ్ఞాపికను అందజేస్తున్న శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు

మలక్‌పేట, అక్టోబర్ 19 ప్రభాతవార్త : సమతుల పోషకాహారంతో చక్కటి ఆరోగ్యం చేకూతరుందుని పోషకాహార విభాగధిపతి డాక్టర్ అవంతిరావు పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్ అనిబిసెంట్ మహిళా కళాశాలలో జీవశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బయో ఫెస్ట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత ఆధునిక భావాలతో పోషకాహార ప్రాధాన్యతను మరిచి జంక్ ఫుడ్‌కు అలవాటుపడి అనారోగ్య సమస్యలను ఎదుర్కుంటున్నారని అన్నారు. సమతుల పోషకాహారాన్ని యువత తీసుకోవడంద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని అన్నారు. పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటూ యోగా, వ్యాయామాలను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అవగాహన లేమితో యువత ఎదుర్కుంటున్న సమస్యలు, సవాళ్లగురించి చర్చించారు. అంతకుముందు నిర్వహించిన పోటీ కార్యక్రమాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ వీణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ స్నేహదేశ్‌ముఖ్, జీవశాస్త్ర విభాగం అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధలను పాటించాలి : ట్రాఫిక్ ఎసిపి సంపత్

మూసారాంబాగ్‌లో పర్యటిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న, డిసి జయంత్

మలక్‌పేట, అక్టోబర్ 19 ప్రభాతవార్త : ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సుల్తాన్ బజార్ ఎసిపి సంపత్, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్నలు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం డిప్యూటీ కమిషనర్ జయంత్‌తో కలిసి వారు మూసారంబాగ్ జంక్షన్‌లో సిబ్బందితో పర్యటించారు. ఫుట్‌పాత్ వ్యాపారస్తుల గుర్తింపు కార్డులను పరిశీలించడంతోపాటు ఫుట్‌పాత్‌లను ఆక్రమించవద్దని సూచించారు. ఫుట్‌పాత్‌లపై ఆక్రమణ నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర వృత్తిదారులకు వడ్డెర బంధు ప్రకటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటకృష్ణ

తుర్కయాంజాల్, అక్టోబర్ 19 ప్రభాతవార్త : వడ్డెర వృత్తిదారుల ముఖ్యకార్యకర్తల సమావేశం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. ఈ సంధర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు కుంచం వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్‌లు మాట్లాడుతూ గ్రామీణ ముఖ్య వృత్తిల్లో వడ్డెర వృత్తిదారులు నిర్మాణ రంగంలో పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ వృత్తిలోకి కార్పోరేట్ కంపెనీలు ప్రవేశించి వడ్డెర వృత్తిదారులను మరింత దారిద్రంలోకి నెట్టి వేయబడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రబుత్వం దళిత బంధు మాదిరిగా వడ్డెర బంధు ప్రకటించాలని వారు కోరారు. వడ్డెరులకోసం గురుకుల పాఠశాలల ఏర్పాటు, 50 సంవత్సరాలు దాటిన ఫీంఛన్, డబుల్ బెడ్ రూమ్స్, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్డెర వత్తిదారుల సమస్యలను పరిష్కరించాలని మాజీ మంత్రి షబ్బీర్ ఆలీకీ వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు దేరంగుల రామకృష్ణ, కురుమయ్య, సైమన్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో ఎమ్మెల్యే బేతి ప్రచారం



చౌటుప్పల్ లక్కారంలో ప్రచారం చేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి

ఉప్పల్, అక్టోబరు 19 ప్రభాతవార్త : మునుగోడు ఎన్నికల ప్రచారంలో భాగంగా చౌటుప్పల్ లక్కారంలోని పలు ప్రాంతాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరు శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గరిక సుధాకర్, మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మేకల ముత్యంరెడ్డి, పల్లె నర్సింగ్‌రావు, డా.బి.వి.చారి, మస్క సుధాకర్, రేపాక కుమారస్వామి, ఎం.కె.బద్రుద్దీన్, ఇర్షద్‌ఖాన్, ఎం.డి.గౌస్, శివ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో నగర మేయర్ విజయలక్ష్మి విస్తృత ప్రచారం

మునుగోడు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి, శ్రీలతరెడ్డి, బన్నాల గీత తదితరులు

ఉప్పల్, అక్టోబరు 19 ప్రభాతవార్త : మునుగోడు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బుధవారం నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటి మేయర్ మోతే శ్రీలతరెడ్డి, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పలువురు పార్టీ నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మునుగోడులో టిఆర్ఎస్ విజయం ఖాయమన్నారు. సిఎం కెసిఆర్ వైపే తెలంగాణ ప్రజలు ఉన్నారని, టిఆర్ఎస్ విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మన్నె కవిత, వనం సంగీత, దేదీప్యరావు, పద్మావతి, సునరితరెడ్డి పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

మునుగోడులో బిజెపి నాయకుల ప్రచారం

ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఎల్.బి.నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త : మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ చౌటుప్పల్ మున్సిపాలిటీ 19వ వార్డులో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు బుధవారం ముమ్మర ప్రచారాన్ని చేపట్టారు. బిజెపితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కమలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, శ్రీశైలం, మంచి రాజేశ్, శివ, కొత్త తిరుమల్, గట్టు మహేష్, సత్యనారాయణ, వెంకటరెడ్డి, శరన్ పాల్గొన్నారు.

మునుగోడులో భాస్కర్‌రెడ్డి ప్రచారం

ప్రచారం నిర్వహిస్తున్న భాస్కర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త : మునుగోడు ఉప ఎన్నికలలో భాగంగా చండూరు మండలం నేర్మట్ట, గొల్లగుడెం, బంగారిగడ్డ, జోగిగుడెం, దినీపాముల గ్రామాలలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాల్వాయి స్రవంతిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ముమ్మర ప్రచారాన్ని చేపట్టారు. ఆయా గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసుల బాలరాజు, సోము లింగస్వామి, బొప్పని సైదులు, వెంటేష్, కల్యాణ్‌యాదవ్, దంతోజు నర్సిహచారి, మహేష్, బండ మహేష్ పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

వనస్థలిపురం, అక్టోబర్ 19 ప్రభాతవార్త : లారీ యజమానులకు సింగిల్ పర్మిట్ విధానం అమలు, ఓవర్ లోడ్ కేసుల్లో డ్రైవర్ లైసెన్స్ సస్పెండ్ నుండి మినహాయింపు, స్పాట్ వెహికల్ రిలీజ్ అమలు హామీలను పరిష్కరించడంతో తెలంగాణ స్టేట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆటోనగర్ ఇసుక లారీల అడ్డ దగ్గర సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో స్టేట్ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి.నందారెడ్డి, ఉపాధ్యక్షులు రాంరెడ్డి, సుర్వి యాదయ్యగౌడ్, కె.బాల్‌రెడ్డి, కొండే శ్రీశైలం, లగ్గోని అంజయ్యగౌడ్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకోవాలి: కమిషనర్

మొక్కల పంపిణీ చేస్తున్న కమీషనర్ నాగేశ్వర్‌రావు, మేయర్ దుర్గ

సరూర్‌నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రజలు స్వచ్ఛందంగా తీసుకోవాలని కమీషనర్ చిట్టి నాగేశ్వర్ రావు కోరారు. కార్పొరేషన్‌లో మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్ ప్రాతినిధ్యం వహిస్తున్న స్వంత డివిజన్ 15లోనున్న అంగన్‌వాడి కేంద్రంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు ఉచితంగా మొక్కల పంపిణీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుళ ప్రయోజనాలు ఉన్న మొక్కల పెంపకాన్ని ప్రజలు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్పొరేటర్లు ముందుకు వచ్చి ప్రతి డివిజన్‌ను హరితవనంగా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుధీర్, మెప్మా రీసోర్స్ పర్సన్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మునుగోడులో ఉప్పల్ బిజెపి కార్పొరేటర్ల ప్రచారం

ప్రచారం చేస్తున్న కార్పొరేటర్లు శ్రీవాణి, చేతన తదితరులు

ఉప్పల్, అక్టోబరు 19 ప్రభాతవార్త : మునుగోడులో బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్లు బండారు శ్రీవాణి, కక్కిరేణి చేతన పలువురు పార్టీ నేతలతో కలిసి విస్తృత్తంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలువురు బిజెపి నేతలు వివిధ గ్రామాలలో పర్యటించి ప్రచారం చేస్తున్నారన్నారు. మునుగోడులో బిజెపి భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు బండారు వెంకట్రామ్, కక్కిరేణి హరీష్, బిజెపి నాయకులు కుమారస్వామి, సంజయ్ పటేల్, రవీందర్‌రెడ్డి, సుమన్‌రావు, కైలాసపతిగౌడ్, ఎన్.శ్రీధర్‌రెడ్డి, సోమశేఖర్‌గౌడ్, వెంకన్నగౌడ్, పూజారి సోమయ్య, శాంతి కుమార్, ఎ.వి.చారి, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక మహోత్సవాలు

ఎల్.బి.నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త : గడ్డిఅన్నారం డివిజన్ లలిత నగర్ కాలనీలోని గడ్డిఅన్నవరక్షేత్రం శ్రీవీర వెంకటసత్యనారాయణస్వామి దేవాలయంలో కార్తీకమాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయం ఛైర్మన్ ఊర నరసింహగుప్తా తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి నవంబర్ 23వ తేదీ వరకు కార్తీకమాసం సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శివుడికి, విష్ణుమూర్తికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు, అభిషేకాలు, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, నిత్య అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

అర్హులందరికీ ఫించన్లు

లబ్ధిదారులకు ఫించను పత్రాలు అందిస్తున్న కౌన్సిలర్ విద్యావతి

హయత్‌నగర్, అక్టోబరు 19 ప్రభాతవార్తః తెలంగాణ ప్రభుత్వం అర్హులందరికీ ఫించన్లను అందిస్తోందని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతి విజేందర్‌రెడ్డి అన్నారు. 4వ వార్డులో 15 మందికి నూతనంగా ఆసరా ఫించన్లు మంజూరు కాగా... వారికి ఆమె బుధవారం సంబంధిత పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కేసీఆర్ పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలను ప్రవేశ పెడుతున్నారని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తెరాస వైపే మునుగోడు ప్రజల చూపు

మునుగోడు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు

తుర్కయాంజాల్, అక్టోబర్ 19 ప్రభాతవార్త : టీఆర్ఎస్ వల్లే మునుగోడు అభివృద్ధి సాధ్యమని, ప్రజలు తెరాస వైపే ఉన్నారని మాజీమంత్రి జోగు రామన్నపేర్కొన్నారు. డీసీసీబీ వైస్ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఆధ్వర్యంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మునుగోడు నియోజకవర్గ ఓటర్లను కలిసి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడులో కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలుపు ఖాయమన్నారు. టీఆర్ఎస్‌ను గెలిపిస్తే ఏడాదిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కందాడ లక్ష్మారెడ్డి, కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సి స్టడీ సర్కిల్ ప్రవేశ ఫలితాలు విడుదల

మలక్‌పేట, అక్టోబర్ 19 ప్రభాతవార్త : మలక్‌పేట జిల్లా కేంద్రంలోని ఎస్సి స్టడీ సర్కిల్ నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ సుచరితరాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను www.tsscstudycircle.co.in అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. అర్హత సాదించిన అభ్యర్థులు సంబంధిత పత్రాలతో ఈ నెల 19 నుంచి స్టడీ సర్కిల్‌లో సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 26 నుంచి తరగతులు ప్రారంభమనున్నట్లు తెలిపారు.

పైప్ లైన్ వేశారు - రోడ్డు మరిచారు
ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

బురదగా మారిన దారి

ఎల్.బి.నగర్, అక్టోబర్ 19 ప్రభాతవార్త : డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. తవ్విన రోడ్డును సరిగా పూడ్చక పోవడంతో ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎవరు స్పందించడం లేదని స్థానిక కాలనీవాసులు అధికారుల తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తపేట డివిజన్ న్యూమారుతినగర్ ఈస్ట్ రోడ్ నెంబర్ 8లో 2నెలల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం తవ్వకాలు జరిపారు. పైప్‌లైన్ నిర్మాణం పూర్తిచేసి రోడ్డుకు సరైన మరమ్మత్తులు చేయకుండా వదిలేశారు. దీంతో ఆ దారి గుండా ప్రయాణించే వాహన చోదకులు, పాదాచారులు, చిన్నపిల్లలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో ఆ ప్రాంతం పూర్తిగా బురదమయంగా తయారయింది. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంవల్ల జరుగుతున్న ప్రమాదాల గురించి ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకునే నాధుడే లేడని వెంటనే మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాల బారి నుండి కాపాడాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : లక్ష్మీ ప్రసన్న

డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న లక్ష్మీప్రసన్న, కాలనీవాసులు

వనస్థలిపురం, అక్టోబర్ 19 ప్రభాతవార్త : గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి బియన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని అఖిలాండేశ్వరి కాలనీలో డ్రైనేజీ మురుగు నీరు పొంగి ఇండ్లలోకి వస్తుండడంతో కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్‌గౌడ్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి కాలనీలో పర్యటించి పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని సమస్య పరిష్కారానికై సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడడంతో అధికారులు తమ సిబ్బందిని కాలనీకి పంపించారు. డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని లక్ష్మీప్రసన్న కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అఖిలాండేశ్వరి కాలనీ అధ్యక్షులు ఎన్.నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ శారద, రాజు, పాండు రంగవిఠల్, అశోక్‌కుమార్, విజయసాయి, రమేష్, శంకర్, అజయ్, వాటర్ వర్క్స్ సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి

సేకరించిన వ్యర్థ పదార్థాలతో విద్యార్థులు

హయత్‌నగర్, అక్టోబరు 19 ప్రభాతవార్తః వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆదేశాల మేరకు హయత్‌నగర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం హయత్‌నగర్‌లోని బస్టాండు పరిసర ప్రాంతాలలో క్లీన్‌ఇండియా 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ... మెరుగైన పారిశుద్ధ్యం ఆరోగ్యానికి సూచికగా తెలిపారు. రంగారెడ్డిజిల్లా జాతీయ సేవాపథక ప్రోగ్రాం అధికారి డా. చింతల రాకేష్‌భవాని విద్యార్థులతో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞను చేయించి దాని ఆవశ్యకతను వారికి వివరించారు. అనంతరం విద్యార్థులు 367 కిలోల వ్యర్థ పదార్థాలను సంచులలో సేకరించారు. వాలంటీర్లకు నెహ్రూయువకేంద్ర వారు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. కార్యక్రమంలో నెహ్రూయువకేంద్ర జిల్లా అధికారి ఐశయ్య, జీహెచ్ఎంసీ మెడికల్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమాజానికి సేవలు అందించాలి

అంజనీకుమారికి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

మలక్‌పేట, అక్టోబర్ 19 ప్రభాతవార్త : సమాజానికి తమ వంతు సేవలు అందించాలని వాజ్‌పేయి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కావ